సాక్షి
పార్వతీపురం మన్యం
గురువారం । 11 । సెప్టెంబర్ । 2025



ఇంజినీరింగ్ కళాశాలకు గ్రహణం..!
కురుపాంలోని గిరిజన ఇంజినీరింగ్ కళాశాల పనులు నిలిచిపోవడంతో విద్యార్థులు, గిరిజన సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. - 8లో



స్కూల్‌గేమ్స్ పోటీల్లో సత్తా చాటాలి - 8లో
స్కూల్ గేమ్స్ పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించే క్రీడాకారులు సత్తా చాటాలని డిప్యూటీ డీఈఓ కె.వెంకటరమణ పిలుపునిచ్చారు.



ఒకే రైతుకు 50 బస్తాల యూరియా విక్రయం - 8లో
తెర్లాం మండలం సుందరాడ గ్రామంలోని ఎరువుల దుకాణ డీలర్‌పై చర్యలకు విజిలెన్స్, వ్యవసాయ అధికారులు సిఫార్సు చేశారు.

న్యూస్‌రీల్

జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయండి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత

విజయనగరం లీగల్: జిల్లాలో ఈ నెల 13న నిర్వహించనున్న జాతీయలోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీఅయ్యేలా చూడాలని విజయనగరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ ఎం.బబిత అన్నారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఉన్న న్యాయమూర్తులతో బుధవారం ఆమె వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. రాజీ పడదగిన క్రిమినల్, మోటారు ప్రమాద బీమా, బ్యాంకు, చెక్కుబౌన్స్, ప్రామిసరీ నోట్ కేసులు, పర్మినెంట్ ఇంజక్షన్ దావాలు, ఎగ్జిక్యూషన్ పిటిషన్, ఎలక్ట్రిసిటీ, ఎక్సైజ్, భూ సంబంధిత కేసులు, కుటుంబ తగాదాలు, మున్సిపాలిటీ, ప్రి లిటిగేషన్ కేసులను ఇరువర్గాల అనుమతితో రాజీమార్గంలో శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.మీనాదేవి, ఐదవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.పద్మావతి, పోక్సో కోర్టు జడ్జి కె.నాగమణి, శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ జి.దుర్గయ్య, ఎ.కృష్ణప్రసాద్, సీనియర్ సివిల్ జడ్జి, కార్యదర్శి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, విజయనగరం, పార్వతీపురం జిల్లాల్లో ఉన్న న్యాయమూర్తులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో కాల్ సెంటర్

పార్వతీపురం రూరల్: జిల్లాలో యూరియా, ఎరువుల సమాచారం కోసం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కాల్ సెంటర్‌ను ఏర్పాటుచేసినట్టు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ బుధవారం తెలిపారు. ఎరువులు, యూరియాకు చెందిన ఏవైనా సూచనలు, మార్గదర్శకాలు, సమాచారం కోసం కార్యాలయ పనివేళల్లో (సెలవు రోజు మినహా) ఫోన్: 089633 59853 నంబర్‌కు ఫోన్‌చేసి తెలుసుకోవచ్చన్నారు.

ఎనీమియా నివారణపై ప్రత్యేక శ్రద్ధ



సమీక్ష సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం రూరల్: జిల్లాలో ఎనీమియా ఎక్కువగా ఉందని, దీని నివారణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఐసీడీఎస్ సిబ్బందికి సూచించారు. ఐసీడీఎస్ లక్ష్యాలపై బుధవారం సమీక్షించారు. ఐసీడీఎస్ నుంచి రక్తహీనతతో బాధపడుతున్న మహిళలు, చిన్నారులకు పౌష్టికాహారం సక్రమంగా అందజేయాలన్నారు. గర్భిణులు 21 రకాలు కలిగిన అదనపు పౌష్టికాహార కిట్లను సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. రక్తహీనత నివారణ చర్యలపై అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో ఐసీడీఎస్ పథక సంచాలకులు టి.కనకదుర్గ, సీడీపీఓలు, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

ఆగని జిందాల్ పోరు



బొడ్డవరలో ఆందోళన చేస్తున్న నిర్వాసితులు

శృంగవరపుకోట: జిందాల్ నిర్వాసితులు తమ పోరుబాటను కొనసాగిస్తున్నారు. కొందరు ఢిల్లీ వెళ్లి బుధవారం ధర్నా చేయగా, స్థానికంగా ఉన్నవారు బొడ్డవరలో యథావిధిగా తమ ఆందోళన కొనసాగించారు. కూటమి నేతలు కార్పొరేట్ శక్తులకు దాసోహమయ్యారంటూ విమర్శించారు. జిందాల్‌కు ఇచ్చిన భూములు తిరిగి ఇచ్చివేయాలంటూ నినదించారు.

- మౌలిక సదుపాయాలు కరువు
- రాళ్లదారుల్లో రాకపోకలకు ఇబ్బందులు
- చేరువకాని విద్య, వైద్య సదుపాయాలు
- ఫ్యామిలీ డాక్టర్ సేవల నిలిపివేతతో అధికమైన డోలీమోతలు
- అత్యవసర వేళ డోలీలో రోగుల తరలింపు

వైద్యం.. దయనీయం!



దారిలేక.. వైద్యం అందక..

జ్వరంతో బాధపడుతున్న బాలికను చీడిమానుగూడ నుంచి కొండాడ రోడ్డువరకు డోలీలో మోసుకువస్తున్న గిరిజనులు (ఫైల్)

సీతంపేట: సీతంపేట ఏజెన్సీలోని ఎగువ ద్వారబంధం, దిగువ ద్వారబంధం గ్రామాలకు సరైన మార్గం లేదు. అలాగే, కొండాడ పంచాయతీ పరిధిలోని చీడిమానుగూడ, మర్రిపాడు పంచాయతీ ఉసిరికి పాడుకు రాళ్లదారే దిక్కు. ఈ గ్రామాల ప్రజలు అస్వస్థతకు గురైతే డోలీలోనే ఆస్పత్రులకు చేర్చాల్సిన దుస్థితి. సుమారు మూడు, నాలుగు కిలోమీటర్ల మేర డోలీలో మోసుకుని దగ్గర్లో ఉన్న రోడ్డుకు తీసుకువస్తేగాని అంబులెన్స్ సేవలు అందని పరిస్థితి. గిరిజన సంక్షేమ శాఖమంత్రి సంధ్యారాణి, స్థానిక పాలకులు స్పందించి గిరిజన ప్రాంతాల ప్రజలకు రోడ్ల కష్టాలు తీర్చాలని గిరిజనులు కోరుతున్నారు.

పల్లె పండగ పేరుతో రోడ్లన్నీ బాగుచేస్తామన్నారు.. గిరిజన ప్రాంతాల్లోని రాళ్లదారులన్నింటినీ అద్దంలా మెరిసిపోయేలా నిర్మిస్తామన్నారు.. రాకపోకలకు కష్టాలు లేకుండా చేస్తామన్నారు.. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర పూర్తవుతున్నా గిరిజన ప్రాంతాల్లో రాళ్లదారులే దర్శనమిస్తున్నాయి. గిరిశిఖర గ్రామాల ప్రజలకు విద్య, వైద్య కష్టాలు షరా మామూలుగా మారాయి. అత్యవసర వేళ రాళ్లదారుల్లో కిలోమీటర్ల మేర డోలీలోనే రోగులను తరలించాల్సిన దుస్థితి. గత ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన ఫ్యామిలీ డాక్టర్ సేవలు నిలిచిపోయాక గిరిజన గూడల్లో వైద్య కష్టాలు అధికమయ్యాయి. డోలీమోతలు నిత్యకృత్యంగా మారాయి. దీనికి ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఇటీవల వైద్యం కోసం గిరిజనుల పాట్లే నిలువెత్తు నిదర్శనం.

వీడని కష్టాలు..

కొమరాడ: మండలంలోని పూడేస్, కుంతేస్, మసిమండ, పెదశాఖ, గుణదతీలేస్, చోళ్లపదం తదితర పంచాయతీల్లోని పలు గ్రామాలకు రోడ్డు సదుపాయం లేదు. గిరిజనలు ఆనారోగ్యానికి గురైతే డోలీ మోతలే శరణ్యం. నాలుగు రోజుల కింద పా లేం పంచాయతీ పరిధి కుస్తూరు గ్రామానికి చెందిన తాడింగి సురేష్ అస్వస్థతకు గురైతే డోలీలో రాళ్లదారిలో 4 కిలోమీటర్ల దూరంలోని పూజారిగూడ వర కు మోసుకొచ్చి అక్కడ నుంచి ఆటోలో కురుపాం పీహెచ్‌సీకి తరలించారు. అనంతరం 108లో కేజీహెచ్‌కు తీసుకెళ్లారు.



కుస్తూరు గ్రామం నుంచి సురేష్‌ను డోలీలో తీసుకువస్తున్న కుటుంబ సభ్యులు(ఫైల్)



తప్పని యాతన

సీహెచ్ బొడ్డవలస నుంచి గిరిజన గ్రామాలకు వెళ్లే రహదారి ఇలా...

బొబ్బిలి మండలంలోని గోపాలరాయుడుపేట, సీహెచ్ బొడ్డవలస, ఏ.వెలగవలస పంచాయతీల పరిధిలోని దాదాపు 12 గిరిజన గ్రామాలు ఉన్నాయి. వీటికి రోడ్ల సదుపాయం లేకపోవడంతో ఆయా గ్రామాల్లో నివసిస్తున్న గిరిజనులు విద్య, వైద్య కష్టాలు ఎదుర్కొంటున్నారు. బొబ్బిలి మండలంలో 30 పంచాయతీలుండగా వాటిలో 20 పంచాయతీలకు 2 పీహెచ్‌సీలు, 2 ఆయుర్వేద, హోమియో ఆస్పత్రులు అందుబాటులో ఉన్నా, మిగిలిన 10 పంచాయతీలకు వైద్యం అందని ద్రాక్షగా మారింది. బట్టివలసలో మహిళకు 25 కిలోమీటర్ల దూరంలోని పిరిడి పీహెచ్‌సీలో ప్రసవం చేయాల్సిన పరిస్థితి.

రోడ్లేవీ..
బొబ్బిలి మండలంలో మొదటి విడత పల్లె పండగ పనుల్లో 266 పనులు చేపట్టినా అందులో ఒక్క గిరిజన గ్రామానికి కూడా రోడ్డు సదుపాయం కల్పించకపోవడంపై గిరిజనులు మండిపడుతున్నారు. బట్టివలస, కొయ్యికొండవలస, చెల్లివలస తదితర సుమారు పన్నెండు గిరిజన గ్రామాల ప్రజల రాకపోకలకు రాళ్లదారులే దిక్కుగా మారాయి.
- బట్టివలస గిరిజన గ్రామంలో ప్రాథమిక పాఠశాల ఓ చర్చిలో నడుస్తోంది. అక్కడ 1, 2 తరగతుల విద్యార్థులు ఏడుగురికి చర్చిలోనే టీచర్ పాఠాలు చెబుతున్నారు.

మట్టిరోడ్డు కూడా వేయలేదు..



గత ఎన్నికల్లో కూటమి నాయకుల వచ్చి పక్కా రోడ్డు వేస్తామన్నారు. ఇంతవరకు కనీసం మట్టి రోడ్డు అయినా వేయలేదు. గ్రామస్తులను అత్యవసర వేళ వైద్యం కోసం డోలీలోనే తరలించాల్సి వస్తోంది.
- కొల్లి నిలోసు, అక్కేనవలస గ్రామం, సీహెచ్ బొడ్డవలస పంచాయతీ

చర్చిలోనే బడి



బట్టివలస, కొత్త బట్టివలస, అక్కేన వలసలకు చెందిన 1, 2 తరగతి పిల్లలు గతంలో ఓ పూరిపాకలో చదువుకునేవారు. అది కూలిపోయింది. గతేడాది కొంతమంది అధికారులొచ్చి షెడ్డు నిర్మిస్తామని చెప్పారు. అతీగతీలేదు. పిల్లలు చదువుకోవడం మనేస్తున్నారు.
- మెల్లక కోంద్రు, బట్టివలస



కొత్త బట్టివలస గ్రామానికి చెందిన గర్భిణిని ఆస్పత్రికి తరలిస్తున్న గిరిజనులు (ఫైల్‌ఫోటో)



మోసేవలస నుంచి డోలీలో క్యాన్సర్ రోగిని తరలిస్తున్న గిరిజనులు

పొలం గట్లపై మూడు కిలోమీటర్లు...

బొబ్బిలిరూరల్: మండలంలోని గోపాలరాయుడుపేట పంచాయతీ పరిధిలోని మోసేవలస గ్రామానికి చెందిన చోడిపల్లి ఆశమ్మ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతోంది. ఇటీవల విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందిన ఆమె గ్రామానికి చేరుకుంది. మలివిడత చికిత్స కోసం బుధవారం డోలీలో పొలంగట్లపై నుంచి మూడు కిలోమీటర్లమేర మోసుకుంటూ ఆమె బంధువులు నారశింహునిపేట వద్దకు చేర్చారు. అక్కడి నుంచి వాహనంలో విశాఖపట్నం తీసుకెళ్లారు. ఏ ఆరోగ్య సమస్య వచ్చినా యాతన తప్పడం లేదంటూ గ్రామస్తులు వాపోయారు. కనీసం రోడ్డు సదుపాయం కల్పించాలని కోరారు.

రోడ్లేవి బాబూ..

శృంగవరపుకోట: మండలంలో గిరిశిఖర గ్రామాల్లో ఉన్న తమకు డోలీ మోతలు తప్పడం లేదని, ఓట్లు దండుకోవడానికి హామీలిచ్చిన కూటమి నాయకులు ఇప్పుడు మాట మరిచార ని గిరిజన సంఘం నాయకులు ఆక్రోశిస్తున్నారు.
- మూలబొడ్డవర పంచాయతీలో బొడ్డవర కూడలి నుంచి చిట్టంపాడు వరకు ఉన్న 10 కి.మీ రోడ్డును బాగుచేయాలని అమ్మపాలెం, మెట్టపాలెం, లక్ష్మిపురం, బొడ్డపాడు, చెలకపాడు, చిట్టంపాడు, గాదెల్లోవ, కొత్త గూనపాడు, పాతగూనపాడు, తదితర గ్రామాల ప్రజలు వేడుకుంటున్నా ఫలితం లేదు.
- ధారపర్తి పంచాయతీ పరిధిలోని రాయవానిపాలెం, నున్నపురాయి, పల్లపుదుంగాడ, కురిడి. పొర్లు, గూనపాడు గిరిశిఖర గ్రామాలకు రోడ్డు సదుపాయం లేకపోవడంతో అత్యవసర వేళ డోలీయే గతి అవుతోంది.
- మూలబొడ్డవర పంచాయతీ పరిధిలోని చిట్టంపాడు గ్రామానికి చెందిన జన్నిరవి అనే యువకుడు ఈ ఏడాది ఫిబ్రవరి 16న కడుపునొప్పి, తీవ్రమైన విషజ్వరంతో అవస్థలుపడడంతో ఆయన బంధువులు ఓ తట్టలో కూర్చోబెట్టి ఏడు కిలోమీటర్ల మేర మోసుకుని ఆస్పత్రికి తరలించారు.
- ధారపర్తి పంచాయతీకి చెందిన నిండుగర్భిణి సుకురమ్మ ప్రసవ నొప్పులతో అవస్థలు పడుతుంటే భర్త శివాజీతో పాటు కుటుంబ సభ్యులు జూన్ 26వ తేదీన డోలీలో తరలించారు. ఆమె ఆ రోజు ఉదయం 8 గంటలకు ఓ బిడ్డకు జన్మనిచ్చింది. ఆరోగ్య పరిస్థితి బాగులేకపోవడంతో 20 కిలోమీటర్ల మేర డోలీలో ఇద్దరినీ దబ్బగుంటవరకు తీసుకొచ్చి అక్కడ నుంచి వాహనంలో ఎస్.కోట ఏరియా ఆస్పత్రికి తరలించారు.



ధారపర్తి నుంచి గర్భిణిని డోలీలో మోసుకొస్తున్న గిరిజనులు (ఫైల్)



సాలూరు రూరల్: ఎగువ కాసాయివలస నుంచి అనారోగ్యానికి గురైన ఆశ వర్కర్ శ్యామలను డోలీలో తరలిస్తున్న కుటుంబ సభ్యులు (ఫైల్)

ఒక రైతుకు 15 కేజీల యూరియా మాత్రమే..!

- ముగ్గురు రైతులకు ఒక బస్తా చొప్పున పంపిణీ
- ఆవేదన వ్యక్తంచేసిన పెదమరికి రైతులు



ముగ్గురు రైతులకు కలిపి ఇచ్చిన ఒక్క బస్తా యూరియాను చూపిస్తున్న గిరిజన రైతులు


పార్వతీపురం రూరల్: ఓ వైపు యూరియా పుష్కలంగా ఉందంటూ అధికారులు ప్రకటనలు ఇస్తున్నారు.. నిన్నమొన్నటి వరకు ఎన్ని ఎకరాల భూమి ఉన్నా ఒక బస్తా యూరియా మాత్రమే అందించారు. ఇప్పుడు ముగ్గురు రైతులకు కలిపి ఒకబస్తా యూరియా (ఒక్కో రైతుకు 15 కేజీల చొప్పున) అందించడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పార్వతీపురం మండలం పెదమరికి గ్రామంలో బుధవారం ఒక రైతుకు 15 కేజీల యూరియా మాత్రమే అందించడంపై మండిపడ్డారు. ఇచ్చిన 15 కేజీల యూరియాను తాము ఏం చేసుకోవాలంటూ అసహనం వ్యక్తం చేశారు. ఇంతటి దారుణ పరిస్థితి ఎన్నడూ చూడలేదన్నారు. రైతుల ఎరువు కష్టాలు పట్టించుకోకుండా సుపరిపాలన అందిస్తున్నామంటూ సీఎం చంద్రబాబు, నేతలు వేడుకలు చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. అబద్ధాల పాలనకు తొందరలోనే తెర పడుతుందన్నారు.

ఇదే మొదటిసారి తీసుకోవడం



పెదమరికి గ్రామ సమీపంలో శివందొరవలస గ్రామం మాది. ఎరువు ఉందంటూ చెప్పారు. టోకెన్లు ఇచ్చారు. తీరా ఎరువుకోసం వెళ్తే ముగ్గురు రైతులు ఒక బస్తా ఎరువు పంచుకోవాలని చెప్పారు. 15 కేజీల యూరియాను ఏం చేయాలో ప్రభుత్వమే సమాధానం చెప్పాలి.
- అద్దాకుల శంకరరావు, గిరిజన రైతు

ఇదెక్కడి పంపిణీ



ఖరీఫ్ సీజన్ మొదలు ఎరువులు ఎప్పుడు ఇస్తారా అని ఎదురుచూశాం. రేషన్ షాపులో బియ్యం మాదిరి 15 కేజీల యూరియా చొప్పున పంపిణీ చేస్తున్నారు. ప్రభుత్వం రైతులకు చేసే మేలుఇదేనా?. యూరియా కోసం ఇన్ని అగచాట్లు ఎప్పుడూ పడలేదు. - పువ్వుల లక్ష్మణరావు, గిరిజన రైతు, చందలింగి గ్రామం

కూటమి విద్యావ్యతిరేక విధానాలపై... టీచర్ల తిరుగుబాటు



నిరసన తెలుపుతున్న ఏపీటీఎఫ్ నాయకులు (ఫైల్)

- నేటి నుంచి ఏపీటీఎఫ్ నిరసన వారం

వీరఘట్టం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ విద్యావ్యతిరేక విధానాలపై ఉపాధ్యాయలోకం తిరుగుబాటుకు సిద్ధమైంది. అడ్డదిడ్డంగా ఉన్న క్లస్టర్ విధానం, అశాస్త్రీయ విద్యానిర్ణయాలు, బోధనేతర పనులు, అసెస్‌మెంట్ విధానంలో మూల్యాంకనం, తదితర సమస్యల నుంచి విముక్తికి పోరాటమే సరైన మార్గమని ఏపీటీఎఫ్ (ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్) భావించింది. ఈ నెల 11 నుంచి నిరసన వారం కార్యక్రమంతో ప్రభుత్వానికి కనువిప్పు కలిగించేందుకు ఉద్యమకార్యాచరణ ప్రణాళికను అమలుచేయనుంది.

డిమాండ్లు ఇవీ..
- ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను వెంటనే విడుదల చేయాలి.
- సీపీఎస్ రద్దు చేయాలి. మెమో నెం.57ను తక్షణమే అమలు చేయాలి.
- 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించి, ఐఆర్ ప్రకటించాలి.
- అన్ని రకాల బకాయిలు చెల్లించాలి. ఈహెచ్‌ఎస్ బకాయిలు రూ.25 లక్షలకు పెంచాలి. యాప్‌లను, అసెస్మెంట్ బుక్‌లెట్ విధానాలను రద్దు చేసి ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలి.

ఇదీ కార్యాచరణ
ఈ నెల 11న నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరుకావడం, 12న మండల కేంద్రాల్లో నిరసన, 13, 14 తేదీల్లో ప్రజా ప్రతినిధులకు వినతి పత్రాలు ఇవ్వడం, 15న డివిజన్ కేంద్రాల్లో నిరసన, 16న జిల్లా కేంద్రాల్లో నిరసన, 17న సీఎం, సీఎస్‌లకు వాట్సాప్, ఈమెయిల్‌లో వినతులు అందజేయనున్నారు.

విజయవంతం చేయండి



ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 11 నుంచి 17 వరకు చేపట్టనున్న నిరసన వారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి. ఉపాధ్యాయులను చైతన్యవంతం చేయడం, భవిష్యత్‌లో జరగబోయే పోరాటాలకు సన్నద్ధం చేసేందుకు ఏపీటీఎఫ్ ఈ నిరసన వారం కార్యక్రమాన్ని ఒక యజ్ఞంలా చేపట్టనుంది.
- మర్రాపు మహేష్, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు, పార్వతీపురం మన్యం

ఖాట్మాండ్‌లో చిక్కుకున్న గుమ్మలక్ష్మీపురం వాసులు

గుమ్మలక్ష్మీపురం: నేపాల్‌లోని ఖాట్మాండ్‌లో గుమ్మలక్ష్మీపురం మండల వాసులు చిక్కుకున్నారు. ఒడిశాకు చెందిన కొంత మందితో కలిసి నేపాల్ సందర్శనకు గుమ్మలక్ష్మీపురం గ్రామానికి చెందిన నెమలిపురి వెంకటరావు, సంతోషిలక్ష్మి దంపతులు, కేదారి పురం గ్రామానికి చెందిన ఎద్దు సుబ్బారావు వెళ్లారు. ప్రస్తుతం అక్కడ అల్లర్లు జరుగుతుండడంతో ఓ హోటల్‌లో తలదాచుకున్నారు. కలెక్టర్ స్పందించి వారిని క్షేమంగా తీసుకొచ్చే ఏర్పాట్లు చేయాలని బంధువులు కోరుతున్నారు.

జిల్లా యాత్రికులు 61 మంది సురక్షితం
విజయనగరం అర్బన్: జిల్లా నుంచి మానవసరోవరం యాత్రకు వెళ్లిన 61 మంది క్షేమంగా ఉన్నారని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. వీరిని సురక్షితంగా జిల్లాకు తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టామని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యాత్రికులను ఖాట్మాండ్ నుంచి గురువారం మధ్యాహ్నం 12 గంటలకు ప్రత్యేక విమానంలో రాష్ట్రానికి చేరుకుంటారని, బంధువులు ఆందోళన చెందవద్దన్నారు.

ఇద్దరు సీసీలు ఎందుకో..?

విజయనగరంఫోర్ట్: డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో సీసీలుగా జామి, రామభద్రపురం పీహెచ్‌సీల నుంచి ఇద్దరు హెల్త్ ఎడ్యుకేటర్లను నియమించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆయా పీహెచ్‌సీల్లో హెల్త్ ఎడ్యుకేటర్లు అందించాల్సిన సేవల్లో జాప్యం జరుగుతోందని ఆరోపిస్తున్నారు. ఒక్క సీసీ అవసరం ఉన్నచోట ఇద్దరిని నియమించడంపై ఆయా ఉద్యోగవర్గాలే ప్రశ్నిస్తున్నాయి. మరోవైపు వైద్య సిబ్బంది బదిలీల్లో చేతివాటం ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇదే విషయంపై డీఎంహెచ్‌ఓ ఎస్.జీవనరాణి వద్ద 'సాక్షి' ప్రస్తావించగా తను వచ్చేసరికే ఇద్దరు సీసీలు ఉన్నారని, ఎందుకు నియమించారో తెలుసుకుంటానన్నారు. ఉద్యోగుల బదిలీల కోసం ఎవరైనా డబ్బులు డిమాండ్‌చేస్తే ఫిర్యాదు చేయాలని, విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు.

శ్రీకనకమహాలక్ష్మి హుండీల ఆదాయం రూ.1,47,173లు



కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

చీపురుపల్లి: పట్టణంలోని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం హుండీల నుంచి రూ. 1,47,173లు ఆదాయం లభించినట్టు దేవస్థా నం ఈఓ బి.శ్రీనివాస్ తెలిపారు. అమ్మవారి దేవస్థానంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ జి. శ్యామ్‌ప్రసాద్ నేతృత్వంలో 2025 జూలై 16 నుంచి 2025 సెప్టెంబర్ 10 వరకు భక్తులు హుండీలలో వేసిన కానుకలను బుధవారం లెక్కించారు. కార్యక్రమంలో ట్రస్టు బోర్డు సభ్యులు గవిడి నాగరాజు, పొట్నూరు త్రినాథ రావు, లెంక చిన్నారావు, ఇప్పిలి పార్వతి, ఇల్లాపు ఆది, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అటవీశాఖ రేంజ్ ఆఫీసర్‌గా రామ్‌నరేష్



బాధ్యతలు స్వీకరించిన రామ్‌నరేష్‌ను అభినందిస్తున్న సిబ్బంది

విజయనగరం గంటస్తంభం: విజయనగరం జిల్లా అటవీశాఖ రేంజ్ ఆఫీసర్‌గా బి.రామ్‌నరేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత అటవీశాఖ రేంజ్ ఆఫీసర్ బి.అప్పలరాజు ఉద్యోగవిరమణ పొందడంతో ఆయన స్థానంలో విధుల్లో చేరారు. జిల్లా అటవీశాఖ కార్యాలయంలో అటవీశాఖ డీఎఫ్‌ఓ, సిబ్బంది ఆయనను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అటవీశాఖకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనతో పాటు, నాణ్యమైన సేవలు అందించడమే తన ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

ఫారెస్టు రేంజర్‌గా మణికంఠేష్



బాధ్యతలు స్వీకరించిన మణికంఠేష్‌ను అభినందిస్తున్న సిబ్బంది

పార్వతీపురం: పార్వతీపురం ఫారెస్టు కార్యాలయంలో ఎలిఫెంట్ మానిటరింగ్ యూనిట్ (ఈఎంయూ)లో పనిచేస్తున్న మణికంఠేష్‌కు ఫారెస్టు రేంజర్‌గా అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ మేరకు బుధవారం ఆయన ఫారెస్టు కార్యాలయంలో రేంజర్‌గా బాధ్యతలు స్వీకరించారు. గతంలో రేంజర్‌గా పనిచేసిన టి.రామ్‌నరేష్‌కు విజయనగరం అటవీశాఖ కార్యాలయానికి బదిలీ కావడంతో మణికంఠేష్‌కు బాధ్యతలను అప్పగించారు. ఈ సందర్భంగా కార్యాలయం సిబ్బంది ఆయనకు స్వాగతం పలికి పుష్పగుచ్ఛమిచ్చి అభినందించారు.

మైనారిటీ చేతి వృత్తిదారులకు రుణ సదుపాయం

- మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఈడీ

పార్వతీపురంటౌన్: జిల్లాలోని మైనార్టీ వర్గాలకు చెందిన వివిధ చేతి వృత్తిదారులను ఆర్థికంగా ప్రోత్సహించే దిశగా ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం కింద రుణ సదుపాయాన్ని కల్పిస్తున్నట్లు మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకుడు షేక్ మహబూబ్ షరీఫ్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 18 ఏళ్లు నిండిన మైనారిటీ వర్గాల్లోని ముస్లిం, క్రిస్టియన్, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్సీలు 18 రకాల వృత్తి పని చేసుకునే వారు ఈ పథకానికి అర్హులన్నారు. సంప్రదాయ కులవృత్తులైన వడ్రంగి, బంగారు ఆభరణాలు తయారుచేసే స్వర్ణకారులు, శిల్పాలు, విగ్రహాలు తయారుచేసే వారు, బుట్టలు, చాపలు, మట్టిపాత్రలు తయారుచేసే కుమ్మరులు, చీపుళ్ల తయారీదారులు, దోబీ, టైలర్, చేపల వలలు తయారు చేయువారు, చెప్పులు కుట్టేవారు, తాపీ కార్మికులు క్షవర వత్తిదారులు, సంప్రదాయ బొమ్మలు, పూలదండలు, పడవల తయారీదారులు, ఇంటి తాళాల తయారీదారులకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు చెప్పారు. గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం వద్ద నుంచి ఎలాంటి రుణాలు తీసుకుని ఉండరాదని, కుటుంబంలో ఒకరు మాత్రమే ఈ పథకానికి అర్హులని, కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగులు ఉంటే పథకానికి అనర్హులని స్పష్టం చేశారు. ఆసక్తి, అర్హత గల వృత్తిదారులు తమ ధ్రువీకరణ పత్రాలతో మీ సేవ, సీఎస్సీ కేంద్రాల్లో www.pmvishwakarma.gov.in వెబ్ సైట్‌లో దరఖాస్తు నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. దరఖాస్తు చేసుకునే వారు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, బ్యాంకు పాస్ పుస్తకం తప్పనిసరిగా కలిగి ఉండాలని, ఇతర వివరాల కోసం కార్యనిర్వాహక సంచాలకుడు, మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్, విజయనగరం వారిని సంప్రదించవచ్చని సూచించారు.



పత్రికాస్వేచ్ఛలేని ప్రజాస్వామ్యం ఊహించలేం

ప్రజాస్వామ్య దేశంలో పత్రిక హక్కులు, స్వేచ్ఛ తప్పనిసరి. అలాలేని ప్రజాస్వామ్య దేశాన్ని ఊహించలేం. నిరంకుశ పాలనకు పరాకాష్ఠగా మారుతుంది. ప్రజలకు తెలియకుండా పాలన ఇష్టారాజ్యంగా సాగుతుంది. రాష్ట్రంలో అధిక సర్క్యులేషన్ ఉన్న పత్రికల్లో ఒకటిగా ప్రజలకు సమాచారాన్ని అందిస్తూ సేవలు అందిస్తున్న సాక్షి దినపత్రికపై కక్ష సాధించడం దురదృష్టకరం. ఇలాంటి పరిస్థితులు రాష్ట్ర అభివృద్ధికి ఆటంకంగా మారుతాయి.

– డి.శ్యామ్, ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి





పత్రికలపై కక్షసాధింపు హక్కుల హననమే...

దినపత్రిక సంపాదకునిపై అక్రమ కేసులు పెట్టడం అంటే రాజ్యాంగ హక్కులను హననం చేయడమే. పత్రికలో వచ్చిన వార్త విషయంలో పోలీసులు ఏకంగా ఎడిటర్‌పై పోలీసు కేసు నమోదు చేయడాన్ని ప్రజాస్వామ్యవాదులెవరైనా ఖండించాల్సిందే. ప్రజాప్రతినిధి ఆరోపణల వ్యాఖ్యలను ప్రచురించిన విషయంలో అభ్యంతరాలుంటే అదే పత్రికా ముఖంగా ఖండించాలేగానీ పోలీసు కేసులు పెట్టడం సమంజసం కాదు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాసే విధంగా మీడియా స్వేచ్ఛను హరించడం సరికాదు.

– జేపీవీఆర్‌కే ఈశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి, యూటీఎఫ్

ఇంజినీరింగ్ కళాశాలకు గ్రహణం..!

గిరిజన విద్యాభివృద్ధే లక్ష్యంగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మంజూరు చేసిన గిరిజన ఇంజినీరింగ్ కళాశాలకు మోక్షం కలగడం లేదు. గత ప్రభుత్వం కళాశాల మంజూరు చేసిన తరువాత దాదాపు 80 శాతం పనులు పూర్తి కాగా మిగిలిన పనులు పూర్తి చేయడంలో ప్రస్తుత కూటమి ప్రభుత్వం అలక్ష్యం వహిస్తోంది. దీంతో ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణానికి రాజకీయ గ్రహణం పట్టిందని పార్వతీపురం మన్యం జిల్లాలోని గిరిజన ప్రజలు, పలుగిరిజన సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- కూటమి అధికారంలోకి వచ్చాక నిలిచిపోయిన పనులు
- ప్రభుత్వం స్పందించాలని గిరిజన సంఘాల డిమాండ్



చివరిదశలో నిర్మాణం నిలిచిపోయిన గిరిజన ఇంజినీరింగ్ కళాశాల



నిలిచిపోయిన విద్యార్థుల వసతి గృహ సముదాయం

కురుపాం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండో ఏడాదిలోకి అడుగుపెట్టినా నేటివరకు కురుపాంలో మంజూరైన గిరిజన ఇంజినీరింగ్ కళాశాల పనులు పూర్తి కాకుండా నిలిచిపోయాయని ఆదివాసీ గిరిజనులు వాపోతున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో గిరిజన విద్యాభివృద్ధే లక్ష్యంగా అప్పటి ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పాముల పుష్పశ్రీవాణి పట్టుబట్టి గిరిజన ఇంజినీరింగ్ కళాశాలను మంజూరు చేయించగా వెంటనే ప్రభుత్వం సానుకూలంగా స్పందించి కురుపాం నియోజకవర్గ కేంద్రం సమీపంలో టేకరఖండి గ్రామం వద్ద 105 ఎకరాల ప్రభుత్వ భూమిలో రూ.153.853 కోట్ల అంచనా విలువతో పనులకు నిధులు మంజూచేసింది. కళాశాల పూర్తి నిర్వహణ బాధ్యతలను జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ (జేఎన్‌టీయూకే)కి ప్రభుత్వం అప్పగించింది. త్వరితగతిన కళాశాల పనులు పూర్తి చేసి తరగతులు ప్రారంభించాలని అప్పటి జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఆదేశించింది. అప్పటినుంచి పనులు చురుగ్గా జరిగినా తరువాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అర్ధాంతరంగా నిలిచిపోయాయి.

జేఎన్‌టీయూకే నాలుగో క్యాంపస్‌గా కురుపాం కళాశాల

జేఎన్‌టీయూకే పరిధిలో ఇప్పటికే కాకినాడ, విజయనగరం, నర్సారావుపేటలో మూడు క్యాంపస్‌లు ఉండగా కురుపాం క్యాంపస్ నాలగవదిగా ఉంటుంది. కురుపాం క్యాంపస్‌లో గిరిజన విద్యార్థులకు ఐదు బ్రాంచిలైన కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ ఇంజినీరింగ్, మెకానికల్ ఇంజినీరింగ్, సివిల్ ఇంజినీరింగ్ కోర్సులను అందించేందుకు సిద్ధం చేశారు. ఒక్కో బ్రాంచికి 60 సీట్లు చొప్పున మొత్తం 300 సీట్లు ఉంటాయి. కురుపాం, పార్వతీపురం ప్రాంతాల గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు చర్యలు చేపట్టారు. కురుపాం ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణం పూర్తయి తరగతులు ప్రారంభమైతే మన్యం జిల్లాలోని కురుపాం, సాలూరు, పార్వతీపురం, పాలకొండ నియోజకవర్గాల్లో గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు కళాశాల ఎంతో ఉపయోగ పడుతుంది.

కాంట్రాక్టర్‌కు రూ.8 కోట్ల బకాయి

గిరిజన ఇంజినీరింగ్ కళాశాల పనులు నిలిచిపోయి రెండేళ్లవుతోంది. అలాగే కాంట్రాక్టర్‌కు కూడా సుమారు రూ.8 కోట్ల వరకు బకాయిలు ఉండిపోయాయి. దాదాపు 80 శాతం వరకు పనులు పూర్తి కాగా చివరి దశలో పనులు పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దృష్టి సారించలేదని ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయని మన్యం జిల్లా ప్రాంత ఆదివాసీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే పనులు పూర్తి చేసేందుకు చర్యలు చేపడితే నిరుపేద గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు అవకాశం ఉందని ఆ దిశగా చర్యలు చేపట్టాలని పార్వతీపురం మన్యం జిల్లా ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఇంజినీరింగ్ కళాశాల పనులు పూర్తి చేయాలి



కూటమి ప్రభుత్వం స్పందించి టేకరఖండి గ్రామ సమీపంలో చివరి దశలో నిలిచిపోయిన గిరిజన ఇంజినీరింగ్ కళాశాల పనులు త్వరితగతిన పూర్తి చేయాలి, రాజకీయాలకు అతీతంగా గిరిజనాభివృద్ధే లక్ష్యంగా పనులు వెంటనే చర్యలు తీసుకోవాలి.

ఇంటికుప్పల రామకృష్ణ, ట్రైబల్ రైట్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు

వేయి కళ్లతో ఎదురు చూస్తున్న విద్యార్థులు



గిరిజన ఇంజినీరింగ్ కళాశాల ప్రారంభం కోసం మన్యం జిల్లాలోని గిరిజన విద్యార్థులు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే పనులు పూర్తి కావాల్సి ఉండగా ఆ దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చురుగ్గా పనులు చేపట్టి ఉన్నత విద్యను ఆదివాసీ ప్రాంతానికి అందుబాటులోకి తీసుకు రావాలి.

ఆరిక చంద్రశేఖర్, గిరిజనాభ్యుదయ సంఘం, జిల్లా అధ్యక్షుడు

గిరిజన విద్యార్థుల చెంతకే ఉన్నత విద్య



గిరిజన ఇంజినీరింగ్ కళాశాల వల్ల ఆదివాసీ ప్రాంత విద్యార్థుల చెంతకే ఉన్నత విద్య అందుబాటులోకి వస్తుంది. కనుక ప్రభుత్వం, అధికారులు స్పందించి వెంటనే కళాశాల నిర్మాణం పూర్తి చేసి, తరగతులను ప్రారంభించాలి. పనులు నిలిచి రెండేళ్లవుతోంది.

వల్ల సురేష్, గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు

స్కూల్‌గేమ్స్ పోటీల్లో సత్తా చాటాలి

- డిప్యూటీ డీఈఓ కె.వెంకటరమణ
- రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్ల ఎంపిక ప్రారంభం



టేబుల్‌టెన్నిస్ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు



మాల్కంబ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు



సెపక్‌తక్రా రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించిన క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో జరగబోయే స్కూల్ గేమ్స్ క్రీడా పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించే క్రీడాకారులు ఉత్తమ క్రీడా ప్రతిభతో సత్తా చాటాలని డిప్యూటీ డీఈఓ కె.వెంకటరమణ పిలుపునిచ్చారు. ఈ మేరకు 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి రాష్ట్రస్థాయిలో నిర్వహించే స్కూల్‌గేమ్స్ క్రీడాకారుల ఎంపిక పోటీలను బుధవారం ఆయన నగరంలోని పీఎస్‌ఆర్ స్కూల్‌లో ప్రారంభించారు. టేబుల్ టెన్నిస్, మాలకంబ క్రీడాంశాల్లో అండర్–14,17 విభాగాల్లో బాల, బాలికలకు నిర్వహించిన పోటీల్లో జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన 120 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అందులో టేబుల్‌టెన్నిస్ క్రీడాంశంలో 20 మంది, మాల్కంబ క్రీడాంశంలో 16 మంది క్రీడాకారులు జిల్లా జట్టుకు అర్హత సాధించారు. ఎంపికైన క్రీడాకారులు త్వరలో రాష్ట్రస్థాయిలో జరగనున్న పోటీల్లో జిల్లా తరఫున పాల్గొననున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఈఓ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రీడల్లో రాణించడం ద్వారా ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవచ్చని సూచించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించిన క్రీడాకారులకు ఉద్యోగావకాశాలు సులభంగా లభిస్తాయన్నారు. జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శులు కె.గోపాల్, విజయలక్ష్మిల ఆధ్వర్యంలో జరిగిన ఎంపిక పోటీలను టేబుల్‌టెన్నిస్ జిల్లా అసోసియేషన్ కార్యదర్శి కృష్ణమూర్తి, విజయనగరం డివిజన్ ఇన్‌చార్జి తవిటయ్య, రత్నకిషోర్, శ్రీను, రవి, ప్రవీణ్, శ్రీకాంత్‌లు పర్యవేక్షించారు.

సెపక్‌తక్రా పోటీల్లో 20 మంది ఎంపిక

నెల్లిమర్ల మండలం అలుగోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన సెపక్‌తక్రా అండర్–14,17 బాల, బాలికల ఎంపిక పోటీల్లో 20 మంది జిల్లా జట్టుకు అర్హత సాధించారు. ఎంపిక పోటీల్లో మొత్తం 50 మంది క్రీడాకారులు పాల్గొనగా..పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు ధర్మారావు పర్యవేక్షణలో ఎంపికలు జరిగాయి. జిల్లా జట్టుకు అర్హత సాధించిన క్రీడాకారులు త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్లనున్నారు. ఎంపిక పోటీలను వ్యాయామ ఉపాధ్యాయులు సూర్యారావు తదితరులు పర్యవేక్షించారు.

గంజాయి కేసులో ముద్దాయికి 12 ఏళ్ల జైలు

- ప్రాసిక్యూషన్ జరుగుతుండగా మరో నిందితుడి మృతి



ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: జిల్లాలోని ఎస్.కోట పోలీస్‌స్టేషన్‌లో 2018లో నమోదైన గంజాయి కేసులో ముద్దాయికి 12 ఏళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తూ విజయనగరం ఒకటవ ఏడీజే ఎం.మీనాదేవి తీర్పు వెల్లడించారని ఎస్పీ వకుల్ జిందల్ బుధవారం తెలిపారు. ఈ కేసు వివరాలిలా ఉన్నాయి. ఎస్‌కోట స్టేషన్ పరిధి బొడ్డవర చెక్ పోస్ట్ వద్ద సిబ్బందికి వచ్చిన కచ్చితమైన సమాచారంతో 2018 ఫిబ్రవరి 19 న వాహన తనిఖీలు చేస్తుండగా బొలెరో వ్యాన్ లో పశ్చిమ బెంగాల్ కు చెందిన సంతు ముజిందార్ (36), ఏఎస్‌ఆర్ జిల్లా జీకే వీధి మండలం దుప్పలవాడకు చెందిన పంగి ధనుంజయ్ (24) గంజాయి రవాణా చేస్తూ పట్టుబడగా వారి నుంచి 66.2 కిలోల గంజాయిని ఎస్.కోట పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్.కోట సీఐ వై.రవికుమార్ నిందితులను రిమాండ్‌కు తరలించి, న్యాయస్థానంలో నిందితులపై అభియోగ పత్రం దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్‌లో నిందితుడు (ఎ2) పంగి ధనుంజయ్ పై నేరారోపణలు రుజువు కావడంతో పైవిధంగా శిక్ష విధిస్తూ జడ్జి ఎం.మీనాదేవి తీర్పు వెల్లడించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు (ఎ1) సంతు ముజిందార్ ప్రాసిక్యూషన్ సమయంలో మరణించినట్లు ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. నిందితుడు (ఎ2) పంగి ధనుంజయ్‌కు శిక్ష పడేలా చర్యలు చేపట్టిన పోలీస్ అధికారులు, సిబ్బంది, ఏపీపీని ఎస్పీ వకుల్ జిందల్ అభినందించారు.

దోపిడీ, హత్య కేసులో ముద్దాయికి జీవిత ఖైదు

జిల్లాలోని కొత్తవలస కుమ్మరివీధిలో ఉంటున్న ఒక మహిళపై 2023లో దాడికి పాల్పడి, బంగారు వస్తువులను దోపిడీ చేసిన ఎల్.కోట మండలం జమ్మాదేవి పేటకు చెందిన నిందితుడు మడబత్తుల కృష్ణ (34)కు విజయనగరం 5వ ఏడీజే కోర్టు జడ్జి ఎస్.పద్మావతి జీవిత ఖైదు , రూ.1000 జరిమానా విధించినట్లు ఎస్పీ వకుల్ జిందల్ బుధవారం తెలిపారు. ఈ కేసు పూర్వాపరాల్లోకి వెళ్తే.. కొత్తవలస కుమ్మరివీధిలో మడబత్తుల సూర్యకాంతం తన కొడుకుతో కలిసి నివాసం ఉంటోంది. 2023 ఏప్రిల్ 15వతేదీన గుర్తు తెలియని వ్యక్తి ఇంటిలోనికి చొరబడి, ఆమె తలపై కొట్టి, కంట్లో కారం జల్లి, మెడలో బంగారు పుస్తెల తాడు, చెవిదిద్దులను అపహరించికుని పారిపోయాడు. గాయపడ్డ ఆమెను చికిత్స నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కు తరలించగా మృతిచెందినట్లు ఆమె అన్నయ్య సూడా అప్పలరాజు ఇచ్చిన ఫిర్యాదుపై దోపిడీ చేసి, హత్యకు పాల్పడినట్లు కొత్తవలస పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారని ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. కేసు దర్యాప్తు చేపట్టిన అప్పటి కొత్తవలస సీఐ బాల సూర్యారావు విచారణ చేసి, నిందితుడు కృష్ణను అరెస్టు చేసి, కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేయగా నేరం రుజువు కావడంతో జడ్జి ఎస్.పద్మావతి పైవిధంగా తీర్పు వెల్లడించారని ఎస్పీ తెలిపారు.

ఒకే రైతుకు 50 బస్తాల యూరియా విక్రయం

- విచారణ చేసిన విజిలెన్స్, వ్యవసాయ అధికారులు
- ఎరువుల దుకాణ డీలర్‌పై చర్యలకు సిఫార్సు



ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న విజిలెన్స్, వ్యవసాయ అధికారులు

తెర్లాం: మండలంలోని సుందరాడ గ్రామంలోని ఎరువుల దుకాణ డీలర్‌పై చర్యలకు విజిలెన్స్, వ్యవసాయ అధికారులు సిఫార్సు చేశారు. దీనికి సంబంధించి మండల వ్యవసాయ అధికారి బి.శ్రీనివాసరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఎరువుల దుకాణ డీలర్ ఈ ఏడాది ఏప్రిల్ నెలలో ఒకే రైతుకు 50 యూరియా బస్తాలు విక్రయించినట్లు ఈపోస్ యంత్రంలో నమోదు చేశాడు. దీనిని గుర్తించిన విజిలెన్స్ అధికారులు ఎరువుల డీలర్‌పై దర్యాప్తు నిమిత్తం వచ్చారు. ఫెర్టిలైజర్ కంట్రోల్ ఆర్డర్–1985 ప్రకారం ఒక రైతుకు ఎక్కువ యూరియా బస్తాలు విక్రయించడం నేరం కావడంతో దీనిపై మండల వ్యవసాయ అధికారి బొత్స శ్రీనివాసరావు, విజిలెన్స్ కానిస్టేబుల్ తిరుపతిరావు, సుందరాడ వీఏఏ దేముడు గ్రామానికి వచ్చి ఎరువుల దుకాణ డీలర్ వద్ద ఉన్న రికార్డులను గ్రామ పెద్దలు, రైతుల సమక్షంలో తనిఖీ చేశారు. ఎరువుల దుకాణ డీలర్ ఒక రైతుకు 50బస్తాల యూరియా విక్రయించినట్లు రికార్డుల్లో నమోదు కావడంపై అతనిపై చర్యల నిమిత్తం ఉన్నతాధికారులకు సిఫార్సు చేసినట్లు విజిలెన్స్, వ్యవసాయ అధికారులు తెలిపారు.

14న సాయి వాలీబాల్ అకాడమీలో ప్రవేశాలకు ఎంపికలు

విజయనగరం: విశాఖ పోర్ట్ స్టేడియంలో గల సాయి వాలీబాల్ హాస్టల్‌లో ప్రవేశాలకు ఈనెల 14న బాల,బాలికలకు ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సూరిబాబు, కేవీఎన్ చిన్నారిలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 14 సంవత్సరాలలోపు వయస్సు గల క్రీడాకారులు మాత్రమే ఎంపికల్లో పాల్గొనేందుకు అర్హులుగా పేర్కొన్నారు. ఎంపిక పోటీల్లో పాల్గొనబోయే బాలురు 190 సెంటీమీటర్లు, బాలికలు 170 సెంటీమీటర్ల ఎత్తు కలిగి ఉండాలన్నారు. అదేవిధంగా జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్, గతంలో వాలీబాల్ క్రీడలో సాధించిన సర్టిఫికెట్‌లను వెంట తీసుకువెళ్లాలని సూచించారు. ఆసక్తి గల క్రీడాకారులు 14న విశాఖ పోర్ట్ స్టేడియంలో జరిగే ఎంపికల్లో పాల్గొనవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ 8919421590 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

వ్యక్తి ఆత్మహత్య

మెంటాడ: మండలంలోని గుర్ల గ్రామానికి చెందిన కుమిలి అప్పరావు కుమారుడు సంతోష్(35) అవివాహితుడు. మంగళవారం రాత్రి 11గంటలకు కుటుంబసభ్యుల వల్ల మద్యం మత్తులో పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. కుటుంబసభ్యులు వెంటనే గజపతినగరం ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు డాక్టర్ తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.సీతారాం తెలిపారు.

చికెన్		
బ్రాయిలర్		
లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹150	₹270	₹280

ఆటో బోల్తా పడి ఒకరి మృతి


- మరో ముగ్గురికి గాయాలు



గాయాల పాలైన వారికి సపర్యలు చేస్తున్న పెద్దబంటుపల్లి గ్రామస్తులు

గుర్ల: మండలంలోని పెద్దబంటుపల్లి ప్రధానరహదారిలో బుధవారం ఆటో బోల్తా పడి ఓ వ్యక్తి మృతి చెందగా మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలకు మేరకు..మెరకముడిదాం నుంచి గరివిడి వస్తున్న ఆటోకు పెద్ద బంటుపల్లి వద్ద అడ్డంగా కుక్క రావడంతో డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేశాడు. దీంతో ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో మెరకముడిదాం మండలం సింగవరం గ్రామానికి చెందిన మన్యపురి తవిటినాయుడు (59) మృతి చెందాడు. గాయాలపాలైన ముగ్గురిని చీపురుపల్లి ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ మేరకు గుర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తీవ్రజ్వరంతో బాలుడు..



మృతిచెందిన బాలుడు కిరణ్

రేగిడి: మండల పరిధిలోని అంబాడ గ్రామానికి చెందిన ముడిదాన కిరణ్ (6) తీవ్ర జ్వరంతో మృతిచెందాడని ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు బుధవారం విలేకరులకు తెలిపారు. ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్న కిరణ్ మృతి వార్త తెలుసుకుని కుటుంబ సభ్యులను హెచ్ఎం మీసాల సత్యంనాయుడుతో కలిసి ఆయన పరామర్శించారు. వేకువజామున నాలుగు గంటల సమయంలో గుండెలో నొప్పి వచ్చిందని, అనంతరం వాంతులు కావడంతో అపస్మారకస్థితికి చేరుకోగా కుటుంబ సభ్యులు రాజాం కేర్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే బాలుడు మృతిచెందాడని వైద్యులు తెలిపారని ఎంఈఓ పేర్కొన్నారు. ఆయనతో పాటు ఉపాధ్యాయులు ఎం.సింహాచలం, డి.ప్రసాద్, బాలుడు తండ్రి జోగినాయుడు తదితరులు పరామర్శలో పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చెంతకు బాలిక



బాలికను తల్లిదండ్రులకు అప్పగించిన ఎస్సై అనీష్, సిబ్బంది

జియ్యమ్మవలస: చినమేరంగి పోలీస్ స్టేషన్ పరిధిలో బాలిక అదృశ్యమైందని మంగళవారం తల్లిదండ్రులు ఇచ్చిన సమాచారం మేరకు ఎస్సై అనీష్ కేసు నమోదు చేఇరు. ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు డీఎస్పీ రాంబాబు, సీఐ తిరుపతిరావు సూచనల మేరకు ఎస్సై అనీష్, సిబ్బంది గాలించి కైకలూరు మండలం గుమ్మలపాడులో బుధవారం బాలికను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. బాలికను అప్పగించిన పోలీసులకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

మద్యం అక్రమ అమ్మకాలపై ప్రత్యేక డ్రైవ్

- నలుగురి అరెస్టు



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిల్స్

కురుపాం: మద్యం అక్రమ అమ్మకాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సీఐ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కురుపాం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అనధికార అమ్మకాలు (బెల్ట్ షాపులు) నిర్వహిస్తున్న వారి కోసం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారిపై ఐదు రోజుల పాటు స్పెషల్‌డ్రైవ్ నిర్వహించి బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న నలుగురిపై కేసు నమోదు చేసి వారి నుంచి 32 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా అక్రమంగా మద్యం అమ్మకాలు చేసినా, గొలుసు దుకాణాల నిర్వహణకు వేలం పాట నిర్వహిస్తున్నా అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్‌కు సమాచారం ఇవ్వాలని సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై జె.రాజశేఖర్ సిబ్బంది పాల్గొన్నారు.